ఏక దంతాయ.. విభిన్న రూపాయ

వినాయక చవితి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పందిళ్లు వేసి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకదంతుడు విభిన్న రూపాల్లో కొలువుతీరాడు. దీంతో ఏ వీధిలో చూసినా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

- కొలువుదీరిన గణనాథులు
- వాడవాడలా గణపతి నవరాత్రుల సందడి


77వ వార్డులో భక్తులకు అన్నం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, బట్టు పైడిరెడ్డి

గాజువాక: ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో ఏర్పాటు చేసిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి విగ్రహాన్ని శనివారం ఘనంగా ప్రతిష్ఠించారు. మండపం వద్ద చాక్లెట్‌తో ఏర్పాటు చేసిన అయోధ్య రామయ్య విగ్రహం భక్తులను ఆకట్టు కుంటోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, నాయకులు స్టాలిన్, కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు గణేష విగ్రహాన్ని దర్శించుకున్నారు. రాష్ట్రంలోనే పెద్ద విగ్రహం కావడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు. 21 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్ కుమార్ తెలిపారు. కాగా, వినాయక చవితి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలు ఆకట్టుకొంటున్నాయి. ఇదిలా ఉండగా, వినాయక మండపాల వద్ద రెండోరోజైన ఆదివారం సందడి తగ్గింది. శనివారం రాత్రి ప్రారంభమైన వర్షం ఆదివారం కూడా తెరిపిలేకుండా కురవడంతో అందరూ ఇళ్లకే పరిమితమయ్యారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు ధర్మాల వీధిలో శ్రీ పెంటమాంబ యువజన సేవా సంఘం ప్రతినిధులు ఎల్లయ్యరెడ్డి, పిట్ట రమణ, భాను శంకర్‌రెడ్డి, రామిరెడ్డి,గొందేశి సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు.తొలిపూజలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తిప్పల దేవన్‌రెడ్డి, తిప్పల వంశీరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



గణపతికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి

- జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయ్, పల్లా శ్రీనివాసరావు, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, కాలనీ పెద్దలు చెల్లి రుషికేష్, గాలి అన్వేష్ పాల్గొన్నారు.
- జీవీఎంసీ 77వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన పలు మండపాలను పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వార్డు నాయకుడు బట్టు పైడిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సింహాద్రి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను వారు ప్రారంభించారు.
- సంకటమోచన గణపతి దేవాలయంలో వినాయక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. .ఆలయ పతినిధి మంత్రి నరసింమమూర్తి, అలయ ట్రస్టీ మంత్రి శంకరనారాయణ పాల్గొన్నారు.
- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో వాల్మీక యువజన సంఘం ఆధ్వర్యంలో,విశ్వ బ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను కార్పొరేటర్ గంధం శ్రీనివాస రావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి శంకర నారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


గాంధీనగర్ లో గణపతికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ గంధం శ్రీను, బాలకృష్ణ తదితరులు

జిమ్ పరికరాలతో విఘ్నేశ్వరుడు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెంలో వినాయకుడు వినూత్నంగా కొలువు తీరాడు. ఆర్కే షేప్ ఫిట్నెస్ జిమ్ నిర్వాహకుడు బర్ల రవికుమార్ యాదవ్ జిమ్‌లోని వ్యాయామ సామగ్రితో విఘ్నేశ్వరుడిని రూపొందించాడు. వినాయకుడే వ్యాయామ శాలకు వచ్చాడా అన్నట్లుంది.


చాక్లెట్‌తో తయారు చేసిన అయోధ్య రామయ్య

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ట్రాఫిక్ అవుట్ పోస్టులో ట్రాఫిక్ సిబ్బంది వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. పూజల్లో ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడఅప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్, కాళికానగర్, రాంనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడిని వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ దర్శించుకున్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో ఏర్పాటు చేసిన మండపాన్ని వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు దర్శించుకున్నారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: ఉక్కునగరంలోని అన్ని సెక్టార్లలో వినాయక ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. సెక్టార్–1లోని సత్యసాయి సేవా కేంద్రంలో భక్తులు వినాయకచవితి పూజలు చేశారు. ట్రై వీక్లీ వర్తకుల ఆధ్వర్యంలో వినాయకుడి ప్రతిమను అలంకరించారు. సెక్టర్–4 కాంప్లెక్స్‌లో వర్తకులు, ఉద్యోగులు వినాయకునికి పూజలు చేశారు. సెక్టార్–5 జై గణేష్ పూజా కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీబాల రాముని అవతారంలో పర్యావరణ హితంగా వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు విష్ణు, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

- సెక్టార్–6 షాపింగ్ కాంప్లెక్స్‌లో సిద్ధివినాయక పూజా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్తిబాబు, చిరంజీవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సెక్టార్–8 నుంచి సెక్టార్–11 వరకు ఉద్యోగుల ఆధ్వర్యంలో మట్టితో చేసిన విగ్రహాలు ఏర్పాటు చేశారు.


జిమ్ పరికరాలతో రూపుదిద్దుకున్న విఘ్నేశ్వరుడు


షీలానగర్‌లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో..

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు

అగనంపూడి: 87వ వార్డు కణితి కళింగ వీధిలో కళింగ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు సాగి విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, దుగ్గపు దానప్పలు, సాగి చినరామ్, ప్రగడ శ్రీను పాల్గొన్నారు.

- వడ్లపూడి నిర్వాసితకాలనీ అప్పికొండ కాలనీలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివారావు, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.
- 86వ వార్డు వుడా ఫేజ్–1లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా పూజలు చేశారు. అసోసియేషన్‌లో మూడు దశాబ్దాలుగా పనిచేసిన కంచుమూర్తి ఈశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాటూరి శ్రీనివాస రావు, పీఆర్‌ఖాన్, వరహాలబాబు పాల్గొన్నారు.
- రాజీవ్‌నగర్ వుడా ఫేజ్–7 ద్వారకాపురి కాలనీలో అసోసియేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలను వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు ప్రారంభించారు.
- వడ్లపూడి ఆస్పత్రి వెనుక వీధిలో దుర్గ భవానీ యూత్ ఆధ్వర్యంలో మర్రిచెట్టు కొమ్మ ఊయలలో ఊగుతున్న విఘ్నపతి మండపం ఏర్పాటు చేశారు.


మిందిలో వినాయకుడిని దర్శించుకున్న గుడివాడ లతీష్


నాతయ్యపాలెంలో..


87వ వార్డు కణితిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి


వడ్లపూడి నిర్వాసితకాలనీలో పూజలు చేస్తున్న కోమటి శ్రీనివాసరావు


86వ వార్డులో ఈశ్వరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు


వుడా ఫేజ్-7 ద్వారాకపురి కాలనీలో..


ఉక్కునగరం సెక్టార్ 6 కాంప్లెక్స్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు


సెక్టార్ 5 కాంప్లెక్స్‌లో అయోధ్య బాలరాముని అవతారంలో..


ఉచ్ఛిష్ట మహాగణపతిని దర్శించుకొంటున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి


వడ్లపూడిలో మర్రిచెట్టు కొమ్మపై ఊయల ఊగుతున్న విఘ్నపతి

క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ సీఐగా కేశవరావు బాధ్యతల స్వీకరణ


సీఐ కేశవరావును అభినందిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐగా వినుకోటి కేశవరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వహించిన వి. శ్రీనివాసరావుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కేశవరావు వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన కేశవరావు మల్కాపురం, మహారాణిపేట, బొబ్బిలిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. నూతన సీఐ కేశవరావును స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బయ్యే మల్లయ్య, డి. పుల్లారావు కలిసి అభినందించారు.

తిరుమలేశునికి సహస్ర నామార్చన


విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన తిరుమలేశునికి శనివారం సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే స్వామికి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత వెంకన్నను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

శాతవాహన నగర్‌లో పోస్టాఫీస్



శాతవాహన నగర్‌కు పోస్టాఫీస్ తరలించినట్టు ఏర్పాటు చేసిన బోర్డు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డులోని వడ్లపూడి పోస్టాఫీస్‌ను 86వ వార్డు కూర్మన్నపాలెం శాతవాహన నగర్ రోడ్డు నంబర్–1కు తరలించినట్టు పోస్టల్ అధికారులు తెలిపారు. గతంలో కొనసాగిన పోస్టాఫీస్ భవనం వద్ద బోర్డు ఏర్పాటు చేస్తూ వివరంగా చిరునామాతో వేలాడదీశారు. పోస్టల్ వినియోగదారులు గమనించాలని అధికారులు కోరారు.

ప్రతి ఆడపిల్లను గౌరవిస్తాం


సంతకాలు చేస్తున్న చర్చి సభ్యులు

గాజువాక: గాజువాక హోలీక్రాస్ చర్చిలో మేరీమాత జన్మదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఆడపిల్లను గౌరవిస్తామంటూ చర్చి సభ్యులు ఈ సందర్భంగా సంతకాలు చేశారు. ప్రతి ఆడపిల్లను గౌరవిస్తాం, ఏ ఒక్కరినీ మోసం చేయబోమని, అసభ్యకరంగా ప్రవర్తించబోమని, నా దేవుని సాక్షిగా, నా తల్లి మరియమ్మ సాక్షిగా మాట ఇస్తున్నామంటూ సభ్యులు సంతకాలు చేశారు. ఆడపిల్లను బతకనిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. చర్చి ఫాదర్ ఆర్‌జీ ప్రకాష్ పాల్గొన్నారు.

వణికిస్తున్న వాన

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు చలిగాలులు ప్రజలను వణికిస్తున్నాయి. రోడ్లు జలమయం అయ్యాయి. కొండవాలు ప్రాంతాల్లో రక్షణగోలు నాని కూలుతున్నాయి. దీంతో ప్రజలు భయం భయంగా జీవనం సాగిస్తున్నారు.

- కొండవాలులో కూలుతున్న గోడలు
- గంగవరంలో కూలిన పెంకుటిల్లు
- భయం భయంగా కొండవాలు ప్రాంత ప్రజలు

గాజువాక: తుపాను కారణంగా కురుస్తున్న వర్షానికి గాజువాక కొండవాలు ప్రాంతాల్లో గోడలు కూలుతున్నాయి. ఈ సంఘటనలతో కొండవాలు నివాసులు బిక్కుబిక్కుమంటున్నారు. గాజువాక ప్రాంతంలోని రెండుచోట్ల కొండవాలులో గోడలు విరిగి పడ్డాయి. అయితే, ఎవరికీ ఎటువంటి నష్టం చోటుచేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. 71వ వార్డులోని శ్రీరామ్‌నగర్ కొండపై ఇల్లపు కుమారి అనే మహిళ ఇంటి ప్రహరీ కూలి దిగువన ఉన్న మాసవరపు రాజు ఇంటి శ్లాబుపై పడింది. విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక నాయకులు పరామర్శించి వారిని ధైర్యం చెప్పారు. 65వ వార్డులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని కొండవాలులో కూడా ఒక ఇంటి ప్రహరీ కూలింది. ఈ పరిస్థితుల్లో కొండవాలు ప్రాంత నివాసులు ఆందోళన చెందుతున్నారు.

జోనల్ కమిషనర్ పర్యటన

కుంభవృష్టిగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కొండవాలు ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు ఆదివారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని నివాసులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రమాదం పొంచి ఉన్నచోట వెంటనే ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఆదేశించారు. ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా ఉండవద్దని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు.


ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ధ్వంసమైన కొండవాలు మార్గం

24/7 కంట్రోల్ రూమ్

మరో మూడు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో గాజువాక జోనల్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు జోనల్ కమిషనర్ తెలిపారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా 0891 2753535 నంబర్‌లో సంప్రదించాలన్నారు. సచివాలయాల్లో అడ్మిన్లను కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

గంగవరంలో కూలిన పై కప్పు

పెదగంట్యాడ: మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 64వ వార్డు ధి గంగవరం బడేవారి వీధికి చెందిన ఉమ్మడి ధనం అనే మహిళ పెంకుటిల్లు పై కప్పు ఆదివారం ఉదయం కుప్పకూలింది. భర్త ఎల్లయ్య మరిణించిన తర్వాత ఓ గది వాడటం లేదు. మరో గదిలో ధనం నివాసం ఉంటోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాడని గది పై కప్పు కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని ధనం కోరుతోంది.


శ్రీరామ్‌నగర్‌లో కూలిన కొండవాలు గోడ


జీసీ రోడ్‌లో స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసినాయుడు


వర్షానికి కూలిన పెంకుటిల్లు పైకప్పు

చెరువుల్లా రహదారులు


చెరువును తలపిస్తున్న రహదారి


జలమయమైన నాతయ్యపాలెం నుంచి షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి రోడ్డు

పెదగంట్యాడ: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకలు, ప్రయాణికులు హడలిపోతున్నారు. వుడాకాలనీ ప్రధాన రహదారిలో ఇటు వెంపళ్లనగర్ నూకాలమ్మ ఆలయం నుంచి అటు వంటిళ్ల కూడలి వరకూ ఇదే పరిస్థితి. వర్షానికి రోడ్లపై కంకర రాళ్లు ఒకచోట పేరుకుపోతున్నాయి.వేగంగా వచ్చే వాహనాలు జారిపోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

అక్కిరెడ్డిపాలెం: నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు నాతయ్యపాలెం నుంచి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వెళ్లే రోడ్డు నీట మునిగింది. ఆదివారం ఎగువ ప్రాంతం నుంచి భారీగా వర్షపు నీరు వచ్చింది. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 10న రాస్తారోకో

అనకాపల్లి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 10న కూర్మనపాలెంలో రాస్తారోకో నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, 1300 రోజులుగా కార్మిక సంఘాలు నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. మోదీ విధానాలతో ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఉత్పత్తి నిలిపివేశాయని, పరిశ్రమను నష్టాల బాటలోకి నెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం చేకూరుతుందన్నారు.

పొంగుతున్న గెడ్డలు

అగనంపూడి: శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు బొర్రమ్మగెడ్డలో వరద తీరు భారీగా వచ్చి చేరుతోంది. ఏడు మెట్ల మర్రిపాలెం, ఫార్మాసిటీ కాలనీల మీద నుంచి వర్షపు నీరు బొర్రమ్మగెడ్డలో చేరడంతో బొర్రమ్మ గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయితే కాలువకు రెండువైపులా రక్షణ గోడ నిర్మించడంతో ప్రమాదం లేదని అధికారులు చెబుతున్నారు.


బొర్రమ్మగెడ్డ నుంచి పారుతున్న వరద నీరు


అగనంపూడి రహదారిపై వర్షపునీరు